రీ సర్వేపై సబ్ కలెక్టర్ సమీక్ష

భామిని, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే ప్రక్రియపై పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం భామిని తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బందితో సమీక్షించారు. రీసర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రాప్తికి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని సూచించారు. భూ సాగుదారులను గుర్తించి నిబంధనల ప్రకారం చేర్పులు, మార్పులు చేయాలన్నారు. ప్రభుత్వ భూముల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో తహసీల్దార్ ఎన్. శివన్నారాయణ, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలైనా తేలలే..



సీతంపేట పీఎంఆర్‌సీలో గిరిజన మ్యూజియం భవనం

- గిరిజన మ్యూజియం వస్తువులు ఏమయ్యాయో?
- నేటికీ దొరకని ఏసీ యూనిట్లు, సీలింగ్ లైట్లు
- పురోగతి లేని చోరీ కేసు దర్యాప్తు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు
- మండిపడుతున్న గిరిజన సంఘాలు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి)

సీతంపేటలో నిర్మిస్తున్న గిరిజన మ్యూజియంలో విలువైన వస్తువులు చోరీకి గురై నెలలు గడిచినా.. ఇంతవరకు కేసులో ఎటువంటి పురోగతి లేదు. మాయమైన ఏసీ ఔటర్ యూనిట్లు, సీలింగ్ యూనిట్లు ఏమయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. వాటి విలువ సుమారు రూ.పది లక్షల వరకూ ఉండగా.. దర్యాప్తు మాత్రం నత్తనడకన సాగుతోంది. దీనిపై ఐటీడీఏ అధికారులు కూడా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సీతంపేట పీఎంఆర్‌సీలో రూ.కోటితో గిరిజన మ్యూజియం నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో పనులు ప్రారంభ మయ్యాయి. అయితే 2019లో పాలనా పగ్గాలు చేపట్టిన వైసీపీ ప్రభుత్వం గిరిజన మ్యూజియం నిర్మాణంపై అంతగా దృష్టి సారించలేదు. దీంతో గత ఐదేళ్లుగా మ్యూజియం పనులు నత్తనడకనే సాగాయి. కనీసం 50శాతం నిర్మాణం కూడా పూర్తవలేదు. మరోవైపు నిధుల లేమి కారణంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.



అప్పట్లో చోరీకి గురైన ఏసీ ఔటర్ యూనిట్లు ఇవే (ఫైల్)

పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

కూటమి ప్రభుత్వం గిరిజన మ్యూజియం నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు ప్రారంభించింది. దీనిలో భాగంగా సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌తో పాటు గిరిజన మ్యూజియం కోసం రూ.2.5 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే రూ.కోటితో గిరిజన మ్యూజియం పనులు పూర్తి చేసేందుకు ఐటీడీఏ అధికారులు సిద్ధమవుతున్నారు.

గత ఏడాదిలో..

గత ఏడాది అక్టోబరులో మ్యూజియంలో విలువైన వస్తువులు చోరీకి గురయ్యాయి. మ్యూజియంలో 20 ఏసీలను అమర్చగా.. భవనం చుట్టూ ఉన్న 14 ఔటర్ యూనిట్లు కనిపించకుండా పోయాయి. మూడు సీలింగ్ లైట్లు కూడా మాయమయ్యాయి. ఈ విషయాన్ని అప్పట్లో ఆలస్యంగా గుర్తించిన మ్యూజియం క్యూరేటర్ ఐటీడీఏ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పోలీసు లకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వై.అమ్మన్నరావు సిబ్బంది గిరిజన మ్యూజియాన్ని సందర్శించి చోరీకి గురైన వస్తువులు వివరాలను సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే నేటికి ఆరు నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు నిందితులను పట్టుకోలేదు.

- చోరీ ఘటన తర్వాత పీఎంఆర్‌సీ గెస్ట్‌హౌస్‌లో అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- గెస్ట్‌హౌస్‌కు పక్కనే ఉన్న గిరిజన మ్యూజియం వద్ద మాత్రం ఎటువంటి భద్రత చర్యలు తీసుకోలేదు. పైగా మ్యూజియంలో ఏర్పాటు కోసం ఆదివాసీల నుంచి సేకరించిన విలువైన వస్తువులను సరిగ్గా భద్రపరచలేదు. ఓ స్టోర్ రూంలో చిందర వందరగా పడేశారు. వాటిల్లో కొన్ని విరిగిపోయి ఆనవాళ్లు లేకుండా పోయాయి.
- నిరంతర పర్యవేక్షణకు రెగ్యులర్ సిబ్బందిని నియమించకపోవడం, ఉన్న సిబ్బంది అందుబాటులో లేకపోవడం మూలంగానే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నట్లు గిరిజన సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఐటీడీఏ ఉన్నతాధి కారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.
- దీనిపై ఎస్ఐ వై.అమ్మన్నరావును వివరణ కోరగా.. 'పీఎంఆర్‌సీలోని గిరిజన మ్యూజియంలో జరిగిన చోరీపై దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.' అని తెలిపారు.



స్టోర్‌రూంలో చిందర వందరగా పడేసిన మ్యూజియం వస్తువులు

100 నుంచి 300 పడకలతో ఆసుపత్రుల నిర్మాణం

- ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుకు ప్రభుత్వ ప్రణాళికలు
- వెల్లడించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పార్వతీపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల ఆసుపత్రుల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వైద్యం, ఆరోగ్యం తదితర అంశాలపై సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పార్వతీపురంలో ప్రస్తుతం 100 పడకల ఆసుపత్రి ఉండగా మరో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్మాణం ఉంది. అదే విధంగా పాలకొండ ఏరియా ఆసుపత్రితో పాటు సీతంపేటలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో ఉంది. సాలూరు ఏరియా ఆసుపత్రిలో వంద పడకలు ఏర్పాటు చేస్తాం. కురుపాం కేంద్రంగా వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు కానుంది.' అని తెలిపారు. జిల్లాలో హైపర్ టెన్షన్‌తో 39,828 మంది, షుగర్‌తో 13,426 మంది, బీపీ, షుగర్‌తో కలిపి 22,922 మంది ఉన్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. జిల్లాకు చెందిన 2211 మంది క్యాన్సర్ రోగులు, కాలేయం బాధితులు 615 మంది, కార్డియోకు సంబంధించి 3,633 మంది ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు పొందినట్టు వెల్లడించారు. డెంగ్యూ, మలేరియా వ్యాధులు ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా ఉన్నట్టు నివేదికల ద్వారా గుర్తించారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానం మార్చుకోవడం ద్వారా రోగాలకు దూరంగా ఉండొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు.

క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లండి

- మండల ప్రత్యేకాధికారులకు కలెక్టర్ ఆదేశం

పార్వతీపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇకపై మండల ప్రత్యేకాధికారులు ప్రతి శుక్రవారం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. అక్క నుంచే వీడియో సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయి సమస్యలపై మండలాల ప్రత్యేక అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని మండలాల్లో అధికారులను మార్పు చేసినట్టు తెలిపారు. ఇకపై మండలాల్లో పర్యవేక్షించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎంఎస్‌వోల వద్ద పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు.



తాగునీటి సమస్య తలెత్తరాదు

జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తరాదని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటికి అంతరాయం కలగకూడదని చెప్పారు. పంచాయతీ పరిధిల సమస్యలను ఎంపీడీవోల దృష్టికి తీసుకురావాలని కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ నిధులు నుంచి మోటార్లను కొనుగోలు చేసి నీటి సరఫరా చేయాలన్నారు. పాచిపెంట మండలం ములగపాడు, కందివలస, కాకులమడ గ్రామాల్లో నీరు కలుషితమై ప్రజలు రోగాలపాలవడంపై కలెక్టర్ మండిపడ్డారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించాలన్నారు. అవసరమైతే తాత్కాలికంగా 20 లీటర్ల తాగునీటి క్యాన్లను అందించాలన్నారు.



రామ పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చక స్వాములు

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం

నెల్లిమర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామివారి దేవస్థానంలో సోమవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. నవమిని పురస్కరించుకొని తొమ్మిది రోజుల వసంత నవరాత్రులు ముగిసిన తరువాత ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వ హించిన సంగతి తెలిసిందే. ఉత్సవ ముగింపులో భాగంగా సోమవారం అర్చకులు రామచంద్రునికి పట్టాభిషేకం నిర్వహించారు. శ్రీరాముని తలపై బంగారు కిరీటధారణ చేశారు. అంతకుముందు యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. కలశాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పంచా మృతాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమాలను ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించగా అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరిసింహాచార్యులు, పాణంగిపల్లి ప్రసాద్, పవనకుమార్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

- విషాదంలో డంగభద్రవలస



సీతమ్మ (ఫైల్)

జియ్యమ్మవలస, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం డంగభద్రవలస గ్రామానికి చెందిన ఉపాధి కూలీ పల్ల సీతమ్మ (65) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలో ఉన్న సీతమ్మ చెరువులో ఆమె పనులకు వెళ్లింది. భోజనం అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు మళ్లీ పనులకు హాజరైంది. అయితే కొద్ది సేపటి తర్వాత కళ్లు తిరుగుతున్నాయని చెబుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో వెంటనే వేతనదారులు చేరుకుని ఆమెకు సపర్యలు చేశారు. జియ్యమ్మవలస పీహెచ్‌సీకి తరలించాలని సిద్ధమయ్యేలోగా ఆమె మృతి చెందిందని తెలుసుకున్నారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. కాగా సీతమ్మ మృతితో డంగభద్రవలస గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఏపీవో తులసీదాస్‌ను వివరణ కోరగా.. ఎండ కారణంగా పని ప్రదేశంలోనే వృద్ధురాలి మృతి చెందిందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశానని చెప్పారు.



పని ప్రదేశంలో సీతమ్మకు సపర్యలు చేస్తున్న కూలీలు

సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తాం

- విపత్తుల, అగ్నిమాపకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు

పార్వతీపురం టౌన్/ బెలగాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక కేంద్రాల్లో సమాచార వ్యవస్థను బలోపేతం చేస్తామని విపత్తుల, అగ్నిమాపకశాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో అగ్ని మాపక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 250 కోట్లతో రాష్ట్రంలోని అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణకు త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. పార్వతీపురం, పాలకొండ భవనాల పనులకు రూ.2.5 కోట్ల చొప్పున కేటాయించినట్లు వెల్లడించారు. శాటిలైట్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. రూ.5 కోట్లు విలువ చేసే హజ్మత్ వాహనంతో పాటు రూ.3 కోట్లుతో బ్రీతింగ్ ఆపరేటవ్ సిస్టమ్‌ను సిద్ధంగా ఉంచామని చెప్పారు. పుష్‌టాక్ సెల్యూలర్ వాకీటాకీ స్టేషన్లతో పాటు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాలకు అత్యంత వేగంగా చేరుకునేందుకు గాను రెస్క్యూ టీమ్‌లకు ప్రత్యేక శిక్షణ అందించనున్నామని స్పష్టం చేశారు. సిబ్బంది కొరత ఉంది కానీ త్వరలోనే పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఆర్ఎఫ్‌వో రంజన్ రెడ్డి, డీఎఫ్‌వో శ్రీనుబాబు, అగ్నిమాపక అధికారి ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏడీ శ్రీనివాసులు

ఆయన భూమిలో ఉందని..

- బీటీ రోడ్డును తవ్వేశాడు..
- గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు

కొమరాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం డంగభద్ర - తమ్మన్నదొరవలస గ్రామాల మధ్యలో ఉన్న బీటీ రహదారిని ఓ వ్యక్తి అడ్డంగా తవ్వేశాడు. దీనిపై సోమవారం గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఉపాధి హామీ పథకం కింద రూ. 1.80 కోట్లతో పార్వతీపురం ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆ రహదారిని నిర్మించారు. అయితే తన జిరాయితీ భూమిలో రోడ్డు వేశారంటూ ఓ వ్యక్తి అభ్యంతరం తెలిపాడు. రహదారిని అడ్డంగా తవ్వేశాడు. దీంతో పలు గ్రామాల రాకపోలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కొమరాడ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని విచారణ చేపట్టారు. తన జిరాయితీ భూమిలో రహదారి నిర్మించడం ఏమిటని సదరు వ్యక్తి ప్రశ్నించాడు. తహసీల్దార్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలియజేశారు.



బీటీ రహదారిని తవ్వేసిన దృశ్యం

పోలీసునంటూ బురిడీ

- గూగుల్ మ్యాప్ ఆధారంగా వర్తకులకు ఫోన్లు
- ఎస్ఐ, ఏఎస్ఐగా పరిచయం
- సెల్‌లో మాట్లాడుతూ డబ్బులు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- విజయవాడలో నిందితుడి అరెస్ట్



నిందితుడిని మీడియా ముందు హాజరుపర్చి కేసు వివరాలు చెబుతున్న డీఎస్పీ

పాలకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తాను పోలీసనంటూ ఓ వ్యక్తి పలువురిని బురిడీ కొట్టించాడు. ఎస్ఐ, కానిస్టేబుల్ అని చెప్పి డబ్బులు కాజేశాడు. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు విజయవాడకు చేరుకుని నకిలీ పోలీస్‌ను అరెస్ట్ చేశారు. సోమవారం పాలకొండ పోలీస్‌స్టేషన్‌లో మీడియా ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మున్నవారిపాలెం గ్రామానికి చెందిన మన్న వెంకట నవీన్ గూగుల్ మ్యాప్‌లో వర్తక, వ్యాపారుల పేర్లు, ఫోన్ నెంబర్లు, అడ్రస్ తెలుసుకునేవాడు. ఆ తర్వాత వారికి ఫోన్ చేసి ఎస్ఐగా ఇటీవల విధుల్లో చేరానని, తన కుమారుడికి బాగోలేదని చెప్పేవాడు. అర్జెంట్‌గా డబ్బులు ఇవ్వాలని, ఫోన్‌పే అయినా చేయాలని చెప్పడంతో పలువురు నవీన్‌కు నగదు అందించారు. ఇదే విధంగా గతనెల 31న వీరఘట్టం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యాపారికి ఫోన్ చేశాడు. తాను స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఏఎస్ఐని అంటూ పరిచయం చేసుకున్నాడు. వీరఘట్టం ఎస్ఐ కుమారుడికి ఆరోగ్యం బాగోలేదని, డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆ వ్యాపారస్థుడు రూ.28 వేలు ఫోన్‌పే చేశాడు. ఆ తర్వాత సదరు వ్యాపారస్థుడు నిందితుడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తెలుసుకొనగా మోసపోయామని గ్రహించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు. గతనెల 29న సంతకవిటి మండల పరిధిలో సిమెంట్ వ్యాపారికి కూడా నవీన్ పై విధంగా ఫోన్ చేశాడు. అయితే ఆ వ్యాపారి వద్ద డబ్బులు లేకపోవడంతో ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.70 వేలు చొప్పున నిందితుడికి ఫోన్‌పే చేశారు. అయితే ఆ తర్వాత వారు కూడా మోసపోయినట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరఘట్టం ఎస్ఐ కళాధర్, హెడ్ కానిస్టేబుల్ వి.చంద్రశేఖర్, కానిస్టేబుల్ నవీన్ బృందంగా ఏర్పడి సాంకేతికత సాయంతో నిందితుడి లోకేషన్ తెలుసుకున్నారు. వెంటనే విజయవాడ వెళ్లి వెంకట నవీన్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.55 వేలు నగదును రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

అవిశ్వాస తీర్మానం మరింత ఆలస్యం

- ఫారం-1 నింపడంలో తప్పులు ఉన్నట్లు కలెక్టర్ ధ్రువీకరణ

8లో

సరైన జీవనశైలితోనే ఆరోగ్యం

- డీఎంహెచ్‌వో భాస్కరరావు

7లో



పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదాయానికి అడ్డు'గోడ'

● ఆర్టీసీ కాంప్లెక్స్, బస్టాండ్ మధ్య ప్రహరీతో మూతపడ్డ వ్యాపారాలు
● మునిసిపాలిటీ ఖజానాకు ఏటా రూ.20 లక్షల వరకూ గండి
● నిరుపయోగంగా రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు ● రోడ్డున పడ్డ 100 కుటుంబాలు

రాజాం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం వందలాది మంది ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్ ప్రాంతం నేడు వెలవెలబోతోంది. రెండున్నర దశాబ్దాలుగా ఇక్కడే వ్యాపారాలు చేసుకునే 100 మంది ప్రత్యామ్నాయం వెతుక్కున్నారు. రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు ఖాళీ అయ్యాయి. మునిసిపాలిటీ ఆదాయానికి గండి పడింది. ఇక్కడే ఉన్న నవదుర్గ ఆలయంపై ఆ ప్రభావం పడింది. దీనికి కారణం ఏడాది క్రితం రాజాంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభించడమే కాదు. పాత బస్టాండ్‌కు ఆర్టీసీ కాంప్లెక్స్‌కూ మధ్య ఆర్టీసీ అధికారులు గోడ నిర్మాణం చేపట్టడమే ప్రధాన కారణం. దాంతో మునిసిపాలిటీ ఏటా మున్సిపాలిటీకి ఏటా రూ.18 నుంచి రూ.20 లక్షల వరకూ వచ్చే అద్దెకు గండి పడింది. రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు సైతం నిరుపయోగంగా ఉన్నాయి.

రాజాం-సారధి మేజర్ పంచాయతీల పరిధిలో 1997 డిసెంబరులో అప్పటి కాంగ్రెస్ పార్టీ శాసనసభాపక్ష నాయకుడు పి.జనార్దనరెడ్డి బస్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కాలక్రమంలో 35 షాపులతో రెండు షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించారు. 2005లో రెండు మేజర్ పంచాయతీలతో పాటు మరో మూడు పంచాయతీలను విలీనం చేసి రాజాం నగర పంచాయతీగా రూపాంతరం చెందడంతో బస్టాండ్ ప్రాంతంతో పాటు షాపులను ప్రభుత్వం మునిసిపాలిటీకి బదిలీ చేసింది. అప్పటి నుంచి గతేడాది ఫిబ్రవరి 19 వరకూ ఈ ప్రాంతం లోనే బస్టాండ్‌ను కొన సాగింది. రాజాం కేంద్రంగా 13 డిపోలకు చెందిన సుమారు 100 బస్సులు


నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్


ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్ మధ్య ఉన్న గోడ ఇదే

రాకపోకలు సాగించేవి. అయితే ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభం కావడంతో సుమారు 100 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మున్సిపాలిటీకి చెందిన 35 షాపులతో పాటు జి.సి.క్లబ్‌కు చెందిన షాపులు, బస్టాండ్ ప్రాంతంలో బతుకుతెరువు కోసం ఏర్పాటు చేసుకున్న టీ బంకులు, హోటళ్లు, ఇతరత్రా షాపులన్నీ ఖాళీ అయ్యాయి. దీంతో కొంతమంది ఆక్రమణలకు తెరలేపారు.బస్టాండ్-ఆర్టీసీ కాంప్లెక్స్ మధ్య గోడను తొలగించాలని ఇప్పటికే పలుమార్లు


పాత బస్టాండ్ నుంచి కాంప్లెక్స్‌కు వచ్చేందుకు ఏర్పాటు చేసిన చిన్న దారి

ఇక్కడి వ్యాపారులంతా ఎమ్మెల్యేకు వినతిపత్రాలిచ్చినా ఫలితం కనిపించ లేదు. దీంతో కోట్లాది రూపాయల మునిసిపాలిటీ స్థలం అన్యాక్రాంతమవుతోంది. చీకటిపడితే చాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది.

సెల్‌టవర్ నిర్మాణం చేపట్టొద్దని ఫిర్యాదు

జామి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరం గ్రామం మధ్యలో సెల్‌టవర్ నిర్మాణం చేపట్టనివ్వకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం ఇచ్చారు. ఇప్పటికే గ్రామం మధ్యలో టవర్ రేడియేషన్ వల్ల చాలమంది ఆనారోగ్యంతో బాధపడుతున్నారని వివరించారు. ఊరికి దూరంగా సెల్ టవర్ ఏర్పాటు చేసుకునేలా చూడాలని కోరారు.

నాలుగు రెట్ల పరిహారం ఇప్పించండి

శృంగవరపుకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నుంచి బొడ్డవర వరకు విశాఖ-అరకు రోడ్డు విస్తరణలో భూములను కోల్పోతున్న రైతులకు నాలుగు రెట్ల పరిహారం ఇప్పించాలని సీపీఎం నాయకుడు మద్దిల రమణ డిమాండ్ చేశారు. సోమవారం శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేశారు. తహసీల్దారు ఎం.అరుణకుమారికు వినతి పత్రం అందజేశారు.

ప్రాంతీయ ఆసుపత్రికి బెడ్ షీట్ల వితరణ

శృంగవరపుకోట ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రికు రూ.15 వేలు విలువ చేసే 50 బెడ్ షీట్లను స్థానిక నాయకుడు డి.సూర్యారావు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు జి.ఎస్.నాయుడు, రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ ఎం.ఎస్.ఎన్ మూర్తి పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు ఒకే వినతి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగానికి ఒకే వినతి అందింది. నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య దాన్ని పరిశీలించి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడాలి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజారోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు, యాంటీ రేబీస్ టీకాలు శతశాతం జరిపించాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. హోం కంపోస్టు విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రీ లు పాల్గొన్నారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నెల్లిమర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చన్నపేట జంక్షన్‌లోని కూర్మాన కమల ఇంటిలో 19 సంచులతో కూడిన 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ బి.రామారావు పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సమీపంలోని బొప్పడాం రేషన్ డిపోనకు తరలించినట్లు సీఎస్‌డీటీ ఆర్.శంకరరావు తెలిపారు. నిందితురాలు కమలపై 6ఏ కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

వాయు కాల్యుంతో ఆరోగ్యానికి ముప్పు

నెల్లిమర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వాయు కాలుష్యం పెరిగిపోవడంతో సాధారణ మరణాల కంటే వాయు కాలుష్యం వల్ల 8 రెట్లు అధికంగా సంభవిస్తున్నాయని మిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భానుప్రకాష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం సెంచూరి యన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్య క్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాయు కాలుష్యం ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయమై పీపీటీ ద్వారా వివరించారు. అనంతరం డాక్టర్ జి.రమేశ్ ఆహారం-ఆరోగ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ ఎం.పల్లవి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరించిన మంత్రి

● సమస్య పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ


వినతులు స్వీకరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయనతో పాటు కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీల గాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 187 వినతులు అందాయి.

● ప్రతి అర్జీదారుడికి సరైన పరిష్కారం చూపించి సంతృప్తి చెందేలా రెడ్రస్సల్ చేయడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి నెల సీఎం చంద్రబాబు వినతులపై సమీక్షిస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. గతంలో రెవెన్యూ సమస్యలే అధికంగా వచ్చేవని, రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరించడం వల్ల ఆయా వినతులు తగ్గాయన్నారు. గ్రామాల్లో అనధికార నిర్మాణం చేయడం జరుగుతుందని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. మహిళలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఖరీఫ్‌నకు కొత్త వంగడాలు

● ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ కె.లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్

విజయనగరం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌నకు సంబంధించి వరి, వేరుశనగ, ఆపరాలకు కొత్త వంగడాలను అందుబాటులోకి తెస్తున్నట్లు విజయనగరం ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ కె లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఏరువాక కేంద్రంలో మరో శాస్త్ర వేత్త డాక్టరు కె.తేజేశ్వరరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లా డారు. 1121 రకం వరి వంగడంతో గత ఏడాది ఖరీఫ్‌లో ఎక్కువ మంది రైతులు సాగు చేశారన్నారు. తాజాగా ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్తలు రూపొందించిన ఎంటీయూ 1210, 1310, 1321 వరి వంగడాలు ఖరీఫ్‌లో ఆవిష్కరిస్తామన్నారు. గత ఏడాది ఉపయోగించిన వరి వంగ డం కంటే ఇవి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. దిగుబడి కూడా పెరుగుతుందని తెలిపారు. వేరుశనగ, ఆపరాలకు కూడా కొత్త వంగడాలను అభివృద్ధి చేశామన్నారు. వేరు శనగకు సంబంధించి కదిరి లేపాక్షి, నిత్యహరిత, విశిష్ట వంగడాలను ఉత్పత్తి చేసినట్లు వెల్లడించారు. కదిరి లేపాక్షి రకం నూనెకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే నిత్యహరిత, విశిష్ట వంగడాలు మిగతా అవసరాలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. పెసరకు సంబంధించి ఎస్‌జీజీ-607, 630, 574, మినుములకు సంబంధించి ఎల్‌బీజీ 884, 904, 932తో పాటు టీబీజీ 104, జీబీజీ-45 వంగడాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్‌నకు ఏరువాక కేంద్రం ద్వారా అన్ని రకాల సేవలను అందించనున్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయికి రేగిడి ప్రాజెక్ట్

రేగిడి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రేగిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు బూరవెల్లి ఉమామహేశ్వరి మార్గదర్శకత్వంలో రూపొందించిన నాచురల్ హెయిర్ డై ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. టాప్ 100 ప్రాజెక్ట్‌లలో చోటు దక్కించుకుంది. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా సుమారు లక్ష ప్రాజెక్ట్‌లు ఎంపిక కాగా వాటిలో 100 ప్రాజెక్ట్‌లు ఫైనల్స్‌కు చేరాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపిక కాగా అందులో రేగిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్ ఒకటి కావడం విశేషం. ఈ ప్రాజెక్ట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం మొదటి విడత రూ.35వేలు విడుదల చేసినట్లు ఉమామహేశ్వరి తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను జూలై 29న న్యూఢిల్లీలో ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా డీఈవో మాణిక్యం నాయుడు. జిల్లా సైన్స్ అధికారి టి.రాజేశ్, జిల్లా సైన్స్ ఫోరం ప్రతినిధు లు జి.సన్యాసినాయుడు, బూరి వేణుగోపాల్ అభినందించారు. కార్యక్రమంలో మీనా కుమారి, బీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు

విజయనగరం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పురుషుల అండర్ 19, 23 విభాగాల్లో జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్జీ స్టేడియం ఈ ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

సమస్యలపై స్పందించండి: ఎస్పీ



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ పరిధిలో ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో 41 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యలను వివరించి చర్యలు చట్ట పరిధిలో తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వారంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు శంకరరావు, లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, ఎస్ఐ రాజేశ్ పాల్గొన్నారు.

ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందే..


డిజైన్ మార్చాలని డిమాండ్ చేస్తున్న రైతులు

వేపాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాల్సిందేనని నిర్వాసిత రైతుల పోరాట కన్వీనర్ చల్లా జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండగుళ్ల వద్ద సోమవారం నిర్వాసిత రైతుల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పోలవరం ఎడమ కాలువ డిజైన్ వల్ల వేలాది మంది రైతులు నష్టపోతున్నారన్నారు. 2013 చట్టం ప్రాప్తికి భూములకు బదులు భూమి రైతులకు ఇవ్వాలన్నారు. రైతుల డిమాండ్ మేరకు కలెక్టర్ గ్రామ సభలను నిర్వహిస్తే అన్ని గ్రామాల్లో డిజైన్ మార్చాలని పంచాయతీలు ఏకవాక్య తీర్మానాలు చేశారన్నారు. గ్రామ సభల తీర్మానాలను ప్రభుత్వం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంతో జిల్లా అధికారులు ప్రకటించాలన్నారు. సమావేశంలో జగన్‌తో పాటు పోరాట కమిటీ నాయకులు రౌతు బాబూరావు మజ్జి శ్రీను, ఎం.అర్జునరావు, వేపాడ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ, దబ్బిరాజుపేట మాజీ సర్పంచ్ ఏడువాక అప్పలనాయుడు, సిరికి నాయుడుబాబు, బూసరి నారాయణమూర్తి, ఆదపురెడ్డి అప్పారావు, రమణ తదితరుల గ్రామాల నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.

రోడ్డుకు అటవీ అనుమతులు ఇప్పించండి


వినతిపత్రం అందజేస్తున్న ఒబ్బిన

శృంగవరపుకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట రేగ పుణ్యగిరి రోడ్డుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని నియోజకవర్గ జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఏర్పాటు చేయించిన ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో వినతిపత్రం అందించారు గ్రామానికి రోడ్డు నిర్మించేందుకు కలెక్టర్ అంబేడ్కర్ రూ.4 కోట్లు కేటాయించారని, ఇందుకు రెండు కిలోమీటర్లు రోడ్డు అల్లూరి జిల్లాకు చెందిన అటవీ శాఖ భూములు ఉన్నాయన్నారు. ఈ శాఖ అధికారుల నుంచి అభ్యంతరాలు రావడంతో రోడ్డు పూర్తికావడం లేదన్నారు. అక్కడ కలెక్టర్ దృష్టిలో పెట్టి సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాగునీటి ట్యాంకు ప్రారంభం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుణ్యగిరి ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరాకు కొత్తగా ట్యాంకు, కుళాయిలను సోమవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సండిసోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ, టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లు అలవరచుకోండి

● డీఎంహెచ్‌వో జీవనరాణి
● నగరంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఆరోగ్యకరమైన ప్రారంభం- ఆశాజనక భవిష్యత్తు నినాదంతో ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని డీఎంహెచ్‌వో జీవనరాణి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలన్నా రు. కార్యక్రమంలో డాక్టరు బీవీబీ సుబ్రహ్మణ్యం, పీవోఎస్‌సీడీ వై.మణి, డీఎంవో వి.చినతల్లి ఉన్నారు.

● దత్తిరాజేరు: మండలంలోని కోరపుకొత్తవలసలో వైద్యాధికారి రఘు ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ డి.వి.గిరిబాబు, ఎంపీహెచ్ఈవో బి.మురళీ, సూపర్‌వైజర్ ఆర్.శ్రీనివాసరావు తదితరులున్నారు.

● కొత్తవలస : మంచి ఆరోగ్యం, మంచి పౌష్టికాహారమే ఆరోగ్యానికి మేలు చేస్తుందని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వియ్యంపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలల విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● రాజాం రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పొగిరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి భార్గవి సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అనంతరం వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డా.తేజస్విని ఉన్నారు

సరైన జీవనశైలితోనే ఆరోగ్యం

పార్వతీపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సరైన జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సరైన ఆహార నియమాలు, వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య సమ స్యలకు దూరంగా ఉండొచ్చని తెలిపారు.


ర్యాలీకి జెండా ఊపుతున్న డీఎంహెచ్‌వో

పట్టపగలే చోరీ

● 21 తులాల బంగారం, రూ.35 వేల నగదు అపహరణ
● పోతనాపల్లిలో ఘటన ● రంగంలోకి పోలీసులు, క్లూస్‌టీం


విచారణ చేపడుతున్న సీఐ నారాయణమూర్తి

శృంగవరపుకోట, రూరల్ ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతనాపల్లిలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఎస్.కోట-విజయనగరం ప్రధాన రహదారిలో పోతనాపల్లి వద్ద కిలపర్తి కొండమ్మ తన ఇద్దరు కుమారులు, కోడళ్లతో నివాసం ఉంటోంది. అయితే సోమవారం ఉదయం 10 గంటల సమయంలో కొండమ్మ ఉపాధి పనికి వెళ్లింది. ఆమె కోడళ్లు పోతనాపల్లి గ్రామంలోకి వెళ్లారు. పెద్దకుమారుడు చిన్నారిని తీసుకుని అదే గ్రామంలోని మరదలి ఇంటికి వెళ్లాడు. అయితే ఇంటికి తాళం వేసి గేటు పక్కన ఉన్న కుండీ కింద ఇంటి తాళం చెవి పెట్టి వెళ్లాడు. అయితే ఉపాధి పనికి వెళ్లిన కొండమ్మ 11.30 గంటల సమయంలో ఇంటికి వచ్చింది. ఇంట్లో కొద్ది నిమిషాలు పనిచేసుకుని తమ కుమారుడు బెడ్‌రూం వైపు వెళ్లగా బీరువా తెరిచి ఉంది. వస్త్రాలు కిందపడి ఉన్నాయి. వెంటనే విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. ఇంట్లోని రెండు బెడ్‌రూమ్‌ల్లోని బీరువాలు తెరిచి ఉన్నాయి. అందులో ఇద్దరి కోడళ్లు, మనవళ్లకు సంబంధించిన 21 తులాల బంగారు ఆభరణాలు, రూ.35 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నారాయణమూర్తి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీం ఎస్ఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఇల్లు మొత్తం పరిశీలన చేసి పలుచోట్ల వేలి ముద్రలు సేకరించారు. అయితే పట్టపగలే దొంగతనం జరగడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కుటుంబ సభ్యులు ఇంటి తాళం పెట్టడం వారికి తప్ప ఇంకెవరికీ తెలియదు. అదే విధంగా ఇంట్లో ఎవరూ లేని విషయం గుర్తించి, ఇంట్లోకి దర్జాగా వెళ్లి చోరీకి పాల్పడటంపై అనుమనాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించే పనిలోపడ్డారు. ఎన్నడులేని రీతిలో ఈ ప్రాంతంలో దొంగతనం జరగడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ లాంఛనాలతో సైనికోద్యోగి అంత్యక్రియలు


దేముడునాయుడు (ఫైల్)

కొత్తవలస, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరభద్రపురానికి చెందిన సైనికోద్యోగి రాయపురెడ్డి దేముడునాయుడు(36) అనారోగ్యంతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కత్తాలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన మృతదేహం స్వగ్రామానికి చేరుకుంది. ప్రభుత్వ లాంఛనాల ప్రకారం సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దేముడుబాబు కోల్‌కత్తాలోని భారత సాయుధ దళాలకు చెందిన బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్‌లో జనరల్ రిజర్వ్ ఫోర్స్ విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈనెల 5న దేముడునాయుడు అస్వస్థతకు గురికావడంతో అక్కడే అధికారులు చికిత్స చేయించారు. చికిత్స పొందుతుండగానే ఆదివారం మృతి చెందడంతో సైనిక అధికారులు వీరభద్రపురంలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సీఐ షణ్ముఖరావు సిబ్బందితో వెళ్లి మృతుడి కుటుంబానికి సంతాపం వ్యక్తం చేసి ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. మృతుడికి భార్య నాగమణి, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

11,700 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విజయనగరం క్రైమ్/పార్వతీపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నవోదయం 2.0లో భాగంగా సోమవారం అంతరాష్ట్ర జిల్లా సరిహద్దుల్లో ఎక్సైజ్, పోలీసు సహకారంతో సారా కేంద్రాలను ధ్వంసం చేశారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలోని బొత్తడాపల్లి, జయకోటా, రేవటిగూడ, వేపవలసలతో పాటు కుట్రుబంకిడి గ్రామాల్లో భారీ స్థాయిలో దాడులు నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరెండెంట్ బి.శ్రీనాథుడు పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.జీవన్‌కిషోర్, ఒడిశా ఎక్సైజ్ శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా పోలీసు శాఖల సహకారంతో ఆపరేషన్ పూర్తి చేశారు. ఇందులో 71 మంది సిబ్బంది పాల్గొని డ్రోన్‌ల సహాయంతో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. దాడిలో మొత్తం 11,700 లీటర్లు బెల్లపు ఊట, 60 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరెండెంట్ శ్రీనాథుడు మాట్లాడుతూ ఇదే తరహాలో దాడులను ప్రతి 15 రోజులకు ఒకసారి అమలు చేస్తామన్నారు. నవోదయం 2.0 లక్ష్యాలను సాధించేందుకు దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నామన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇరిడి సమీపంలో సారా తయారు చేస్తున్న స్థావరాలపై సోమవారం కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దాడి చేశారు. ఈ దాడిలో గుండు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని ఆయన నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న ఊట, నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

జియ్యమ్మవలస, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలసకు చెందిన బొమ్మాళి శిరీష ఈనెల 4 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి అనసూయ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరికి గాయాలు

కురుపాం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలిగూడ జంక్షన్‌లో సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మహిళ గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. జి.శివడ గ్రామానికి చెందిన రావు తన భార్య ప్రియతో కలిసి ద్విచక్రవాహనంపై కురుపాం వస్తున్నాడు. అదే సమయంలో కురుపాం నుంచి ఎదురుగా ద్విచక్రవాహనంపై చందు వెళ్తున్నాడు. ఆ సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి. దాంతో ప్రియ గాయపడింది. ఆమెను కురుపాం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించారు.

తండ్రి చెంతకు చేరిన కుమారుడు

కురుపాం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తండ్రి చెంతకు కుమారుడ్ని పోలీసులు చేర్చారు. పోలీసుల కథనం మేరకు.. జియ్యమ్మవలస గ్రామానికి చెందిన చిరు వ్యాపారి సంగమేశు ఇటీవల నీలకంఠాపురంలో జరిగే యాత్రలో దుకాణం పెట్టాడు. ఆయనకు 21 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. అతడు మూగవాడు. యాత్రలో తప్పిపోయిన తన కుమారుడి ఆచూకీ తెలియజేయాలని సంగమేశు నీలకంఠాపురం పోలీసులను ఆశ్రయించాడు. ఎస్ఐ నీలకంఠరావు చొరవతో మెండెఖల్‌లో సంగమేశు కుమారుడిని పోలీసులు పట్టుకున్నారు. అనంతరం తండ్రి వద్దకు చేర్చారు.

వల్లంపూడి ఎస్ఐని సస్పెండ్ చేయండి

వేపాడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపూడి ఎస్ఐ బొడ్డు దేవిపై అట్రాసిటీ కేసు నమోదైన దృష్ట్యా జిల్లా అధికారులు తక్షణమే సస్పెండ్ చేయాలని దళిత కూలీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది గాలి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వేపాడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరుతూ ఈ నెల 9న వేపాడలో పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపడతామన్నారు. వేపాడ, వల్లంపూడిల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆయనతో పాటు దేబారికి కిరణ్, వై.మరియదాసు, నారాయణరావు ఉన్నారు.

'ఆరోగ్యశ్రీపై సర్కారుకు చిత్తశుద్ధి లేదు'

రాజాం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ విమర్శించారు. రాజాంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదోడి ఆరోగ్యానికి రాష్ట్రంలో భరోసా లేదన్నారు. ఆరోగ్యశ్రీ సేవల కింద చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించకుండా జాప్యం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. వెంటనే ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపి వైద్యసేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని చైతన్యకుమార్ సూచించారు.

మహిళాభ్యున్నతే ధ్యేయం

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):మహిళాభ్యున్నతే ప్రభుత్వం ధ్యేయం బొబ్బిలి బేబీనాయన తెలిపారు. సోమవారం రామభద్రపురం శ్రీరాంనగర్ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసంప్రభుత్వం కార్యక్రమాలు రూపొందిస్తోందని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు.అలాగే రామభద్రపురం పశువైద్య కేంద్రంలో ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న పశువుల తొట్టి నిర్మాణానికి, పంచాయతీ కార్యాలయం సమీపంలో కోనేటి సుందరీకరణ పనులకు శంకు స్థాపన చేశారు. మండలంలోని కోటశిర్లాంలో నిర్మించిన లక్ష్మీదేవి పేరంటాలు గుడి ప్రారంభోత్సవం పురస్కరిం చుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపీడీవో రత్నం, ఈవో ఎం.శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రామకృష్ణ, ఎ కరణం విజయభాస్కరరావు, భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావు, రవ్వా ఈశ్వరరావు చొక్కాపు రామారావు, తిరుపతినాయుడు, శంకరరావు, కోట వెంకటనాయుడు పాల్గొన్నారు.



గర్భిణులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న బేబీనాయన

కోమటిపల్లిలో పైప్‌లైన్ల మరమ్మతులు



పైప్‌లైన్‌కు మరమ్మతు చేయడంతో నీటిని పట్టుకుంటున్న మహిళలు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపల్లిలో ఇంటింటి కుళాయిలకు సంబంధించిన పైపులైన్లకు మరమ్మతులు నిర్వహించారు. సోమవారం లక్షల వ్యయం....లక్ష్యం దూరం శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఇంటింటి కుళాయిలు నిరుపయోగంగా ఉండడంపై కథనం ప్రచురితంకావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ఈ మేరకు ఇంటింటి కుళాయిలను పరిశీలించి, పైప్‌లైన్లు మరమ్మతులు చేయించి తాగునీటిని సరఫరాచేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి



హెచ్‌డీటీ గిరిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శంకరరావు

రామభద్రపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఉద్యమంచేపడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు హెచ్చరించారు. సోమవారం రామభద్రపురం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని హెచ్‌డీటీ గిరిధర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం నెలకు రూ.10వేల 500ల జీతంతో వీఆర్‌ఏలు పనిచేస్తున్నారని, చాలీచాలని జీతాలతో కుటుంబాలు పోషించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీఆర్‌ఏలకు నెలకు రూ.26వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్‌ఏలకు నైట్ డ్యూటీలు రద్దుచేయాలని, ప్రమోషన్లు కల్పించాలని, వీఆర్‌ఏ ఖాళీలు భర్తీచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్ర మంలో వీఆర్‌ఏల సంఘ మండలాధ్యక్షుడు మారయ్య, రాజారావు, లక్ష్మి పాల్గొన్నారు.

రహదారి సదుపాయం కల్పించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రామభద్రపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రామభద్రపురంలోని మార్కెట్ సమీపంలో ఉన్న భూములకు రహదారి సదుపాయం కల్పించాలని రైతులు కోరారు.ఈ మేరకు సోమవారం రామభద్రపురం జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి మూడడ్ల అప్పలనాయుడు, వంగపండు సూర్యనారాయణ, మూడడ్ల పైడితల్లి, కొల్లి అప్పలనాయుడు తదితరులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నామని, ఇటీవల రామభద్రపురంలోని కూరగాయల మార్కెట్ పనుల నేపథ్యంలో తమకు రహదారి లేకుండా చేశారని, దీంతో తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.అలాగే జిరాయితీ భూము లను కూడా ఆక్రమించి పనులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమగ్రమైన సర్వేచేసి తమకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు.

యంత్ర పరికరాలకు ఆడిట్ అవసరం లేదు

●ఆగ్రోస్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్‌బాబు



రాఘవాచార్యులకు ఆగ్రోస్ గురించి వివరిస్తున్న చంద్రశేఖర్‌బాబు

బొబ్బిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ, పార్కులు, చెట్లు వంటి పెంపకానికి అవసరమయ్యే వ్యవసాయ యంత్ర పరికరాలను ఆగ్రోస్ ద్వారా కొనుగోలు చేస్తే ఎటువంటి ఆడిట్ అవసరం లేదని ఆ సంస్థ జిల్లా మేనేజరు చంద్రశేఖర్‌బాబు తెలిపారు. సోమవారం బొబ్బిలిలో మునిసిపల్ మేనేజరు రాఘవాచార్యులను ఆయన కలిసి ఆగ్రోస్ ద్వారా సరఫరా చేసే పరికరాలకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రైతులకు వ్యవసాయ ఆధునిక పనిముట్ల రాయితీ కోసం రెండు కోట్ల రూపాయలను ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. రైతులు తమకు కావాల్సిన పనిముట్లు, పరికరాలను వారికి నచ్చిన కంపెనీల్లో కొనుగోలు చేసుకోవచ్చన్నారు.ఆయన వెంట సంస్థ ప్రతినిధులు చంద్రశేఖరరావు,త్రినాథ పాల్గొన్నారు.

అప్పలనాయుడు మృతికి సంతాపం

బొబ్బిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని పూల్‌బాగ్‌లో నివాసముంటున్న రిటైర్డ్ తెలుగుపండిట్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కటికి అప్పలనాయుడు (69) సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. బాడంగి మండలంలోని డొంకినవలస గ్రామానికి చెందిన అప్పలనాయుడు 2014 మేలో రిటైరయ్యారు.ప్రతిభాపాటిల్ రాష్ట్రపతిగాఉన్న సమయంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఆయన స్వీకరించారు. ఆయనకు భార్య విజయ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఈ మేరకు అప్పలనాయుడు మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

బంగారయ్యకు గురుజ్యోతి పురస్కారం

నెల్లిమర్ల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):మండలంలోని తంగుడుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్యకు విశాఖకు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ గురుజ్యోతి ఉగాది పురస్కారాన్ని అందజేసింది. విజయవాడలో హోటల్ అలంకార్ వేదికగా ఆదివారం కార్యక్రమం జరిగింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కాసంశెట్టి కృష్ణమూర్తి అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలోఅవార్డు, సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్, షీల్డ్,సన్మాన పత్రాలను బంగారయ్యకు ప్రదానం చేశారు. ఈసందర్భంగా అవార్డు గ్రహీత బంగారయ్య మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తున్నందుకు తగిన గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. తద్వారా బాధ్యత మరింత పెరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రూత్ మేరీ, డాక్టర్ న్యూటన్ పండు, జ్యోతిష్య బ్రహ్మ కట్టా హరి, కాసంశెట్టి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిల్లంశెట్టి శివకు రజత పతకం

గరివిడి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 కుస్తీ పోటీలలో జిల్లా తరఫున కాపుశంభం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కిల్లంశెట్టి శివ పాల్గొని రజతపతకం సాధించాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు డి.రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ఉదయ్‌కుమార్, సర్పంచ్ పి.సుశీలమ్మ, విద్యా కమిటీ చైర్మన్ పిన్నింటి రామకృష్ణ, గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

కొత్తవలస, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెంట కాపాలు జ్ఞాపకార్థం కుమారులు పి.రమేష్, పి. రవి సోమవారం 45 మంది ఒంటరి వృద్ధులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. తుమ్మికాపల్లి వినాయకనగర్‌లో ఏర్పాటు చేసిన ఫర్‌ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్ పాల్గొన్నారు.

ఆక్వాకు కష్టకాలం

(ఐదో పేజీ తరువాయి)

లీజు వ్యవహారాలతో ఆక్వారంగం మరింత నీరసించి పోయింది. ఆక్వా జోన్ల సమస్య, విద్యుత్ ధరలతో ఏకంగా కుదేలైంది. జగన్ రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను అందిస్తామని చెప్పారు. కానీ అమలు చేయలేకపోయారు. ఈ-షిప్ విధానంలో అనేక నిబంధనలను తెరపైకి తెచ్చారు. టీడీపీ హయాంలో వంద రొయ్యల ధర రూ.250 నుంచి రూ.260 వరకూ ఉండేది. కానీ వైసీపీ హయాంలో రూ.180కు పడిపోయింది. ఉప్పు, మంచినీరు ఆక్వా జోన్లుగా విభజించారు. పది ఎకరాల్లోపు సాగుచేసిన రైతులకు మాత్రమే రూ.1.50కు యూనిట్ విద్యుత్‌ను అందించారు. దీంతో జిల్లాలోని ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ అందలేదు.

ప్రభుత్వాలు రాయితీ కల్పించాలి

దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించడంతో ఆక్వా రైతులు చాలా నష్టపోవాల్సి వస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రాయితీ నిలిపేసింది. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ రాయితీ కల్పిస్తుందని అనుకుంటున్న సమయంలో అమెరికా విధించిన ఆంక్షలు రైతులకు తీరని నష్టాన్ని కలిగించేలా ఉన్నాయి. రొయ్యలు ఉత్పత్తి చేసేబదులు వేరే పని చూసుకోవడం మేలు అనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీ కల్పించి ఆదుకోవాలి.

-మధు, రొయ్యల ఆక్వా రైతు, రామచంద్రపేట, భోగాపురం మండలం.

ఇతర దేశాలకు ఎగుమతులు పెరగాలి..

అమెరికా దిగుమతి సుంకం పెంచుకుపోతున్న పరిస్థితుల్లో ఇతర దేశాలకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించాలి. మన దేశంలో డొమస్టిక్ మార్కెట్ పెరగాలి. కేవలం విదేశీ మార్కెట్‌పై ఆధారపడడం తగ్గించుకోవాలి. ప్రస్తుతం అమెరికా ఆంక్షలతో రొయ్య పిల్లలను తీసుకెళ్లడం లేదు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం రైతులకు గిట్టు బాటు ధర కల్పించేలా హామీ ఇవ్వాలి.

-చిన్నంసారథి, దినాస్ హేచరీ, ముక్కాం, భోగాపురం మండలం

పి-4 సర్వే వేగవంతం చేయాలి

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పి-4 సర్వేను వేగవంతం చేయించాలని అధికారులను కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. సోమవారం బొబ్బిలితహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో భాగంగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో పి.రవి కుమార్, కమిషనర్ ఎల్.రామలక్ష్మిలకు బొబ్బిలి పట్టణం, మండలాల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని ఈవో పీఆర్డీ అల్లు భాస్కరరావు హెచ్చరించారు. సోమవారం మండలంలోని మెట్టవలసలో కాలువల్లో పూడికను తొలగించారు.ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త, కాలువల్లో సిల్ట్ ఉండడాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని రోడ్లు, కాలువలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశిం చారు. ఆయన వెంట ఎంసీవో సుధాకర్ ఉన్నారు.

●రామభద్రపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడువలసలో పంచాయతీకార్యదర్శి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. వీధి కాలువల్లో పూడికలు తీయడంతోపాటు మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టారు. దోమల నివారణకు ఫాగింగ్ వంటి కార్యక్రమాలు కూడా చేశారు.

వలంటీర్లను ఆదుకోవాలి

బొబ్బిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వలంటీర్లకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కోట అప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం బొబ్బిలిలో విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లందరికీ న్యాయం చేస్తామని, రూ. 5 వేల జీతాన్ని రూ.10 వేలు చేస్తామని, చంద్రబాబు, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఉపాధి కోల్పోయి వారంతా రోడ్డున పడ్డారని, ఆర్థిక భరోసా లేక ఉపాధి లేక అవస్థలు పడుతున్నారన్నారు.

రోడ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

బొబ్బిలి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పాడైన పలు ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతుల కోసం రూ. తొమ్మిది కోట్లు మంజూరయ్యాయి. ఉత్తరావల్లి, బాడంగి, ఆకులకట్ట, గొర్లె సీతారామపురం పరిధిలో సుమారు 15 కిలోమీటర్ల పొడవుగల రహదారి మరమ్మతులకు రూ.4.50 కోట్లు, బొబ్బిలి-తెర్లాం రహదారిలో అలజంగి, కారాడ మీదుగా 4.50 కిలోమీటర్ల రహదారి మరమ్మతులకు రూ. 4.50 కోట్లు మంజూరయ్యాయి. ప్యాచ్ వర్క్‌ల కోసం బాడంగి సెక్షన్‌లో 3.20 కిలోమీటర్లకు రూ. 3 లక్షలు, తెర్లాం సెక్షన్‌లో 2.40 కిలోమీటర్లకు రూ. 5 లక్షలు, బొబ్బి లి-బలిజిపేట వయా కోమటిపల్లి మీదుగా, చిలకపాలెం, రామభద్రపురం, రాయగడ రోడ్డులో 4.45 కిలోమీటర్లకు రూ.8.10 లక్షలు, రామభద్రపురంలో రహదారి మరమ్మతుకు 0.35 కిలోమీటర్లకు రూ. 14 లక్షలు మంజూరు చేశారు.బొబ్బిలి-పినపెంకి-శేజేరు-తెర్లాం రోడ్డు, చిలకపాలెం-రాయగడ రోడ్డులో 2.75 కిలోమీటర్లరోడ్డు మరమ్మతుల కోసం రూ. 45 లక్షలు చొప్పున మొత్తం13.15 కిలోమీటర్ల ప్యాచ్ వర్క్‌లకోసం రూ. 75.10 లక్షలు మంజూరైనట్లు ఆర్‌బీ జేఈ బీపీ రాజు తెలిపారు.

నేడు కేంద్ర మంత్రి పర్యటన

భోగాపురం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యటించనున్నారని తహసీల్దారు ఎం.సురేష్ తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు పరిశీలన నిమిత్తం పర్యటనకు రానున్నారన్నారు. అమటాం రాయవలస సమీప ట్రంపెట్ నుంచి ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పరిశీలించనున్నారన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించండి

గరివిడి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యుడు డి.రాము కోరారు. యూటీఎఫ్ పోరుబాటలో భాగంగా సోమవారం కాపుశంభం సర్పంచ్ లెంక సుశీలమ్మ, ఎంపీటీసీ సభ్యుడు టొంపల సంజీవరావు, మాజీ ఎంపీపీ పైల సింహాచలం, బలరాం, పీఏసీఎస్ ప్రెసిడెంట్ లంక శ్రీరాములు, విద్యా కమిటీ చైర్మన్ పిన్నింటి శాంతారావులకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు సూరి శ్రీనివాసరావు, పెద్ది శ్రీనివాసరావు, చల్లా సింహాచలం, అల్లంశెట్టి నిర్మలకుమారి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి

రాజాం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):పంచాయతీల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసరావు కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శిలతో ఆయన సమావేశమయ్యారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి తాగునీరు అందిలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు వసూలు లక్ష్యాన్ని పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు

చీపురుపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసి బ్రిడ్జి కోర్సులో చేరిన విద్యార్థులు సోమవారం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు మాట్లాడుతూ రెండో సంవత్సరంలోకి ప్రవేశించనున్న విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరాలనుకున్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీను, గణపతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై అలసత్వం వద్దు: ఎస్పీ

బెలగాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులపై అలసత్వం లేకుండా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. సోమవారం పార్వతీపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి తొమ్మిది ఫిర్యాదులు అందాయి. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. త్వరగతిన దర్యాప్తు చేపట్టి బాధితులకు తగిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అధిక వడ్డీలు, నకిలీ పత్రాలు, అత్తారింటి వేధింపులు, కుటుంబ తగాదాలు, భూ వివాదాలు, సైబర్ క్రైం తదితర అంశాలపై ఎక్కువగా ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ ఆదాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొఠియాలో భద్రత కల్పించండి

కొఠియా గ్రామాల్లో గిరిజనులు ఒడిశా ప్రభుత్వ అధికారుల దౌర్జన్యాలకు భయభ్రాంతులకు గురవుతున్నారని, ఆయా గ్రామాల్లో తాము పర్యటించడానికి భద్రత కల్పించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురంలో ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి, కలెక్టర్ శ్యాంప్రసాద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర భూభాగంలోని కొఠియా పంచాయతీల పరిధిలోగల 21 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం అక్రమంగా చొరబడి గిరిజనులను భయభ్రాంతులకు గురుచేస్తూ రోడ్లను, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను కూల్చివేసి దిగువ సెంబి వద్ద పవర్ ప్రాజెక్ట్ నిర్మిస్తోందని చెప్పారు.కార్యక్రమాల్లో పౌర వేదిక ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్ర రాజు, కార్యదర్శి టి.రామ్మోహన్‌రావు, జి.సింహాచలం పాల్గొన్నారు.

వేతనదారుల సంఖ్య పెంచాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వేతనదారుల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. సోమవారం మండలంలోని రావుపల్లిలో పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వేతనదారులు తక్కువగా హాజరుకావడంపె అసంతృప్తి వ్యక్తంచేశారు. ముందస్తు కొలతలు అందించిన తదుపరే పనులు నిర్వహించాలన్నారు. కొలతల్లో వ్యత్యాసాలు ఉంటే సహించేది లేదన్నారు.రావుపల్లికి సంబంధించి పలు తప్పిదాలపై ఫిర్యాదులు అందాయన్నారు. క్షేత్ర సహాయకుని కుటుంబ సభ్యుల పేర్లతో జాబ్‌కార్డులు తయారు చేశారన్న విషయంపై దర్యాప్తు నిర్వహించినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి సమాచారం రాగానే క్రమ శిక్షణ చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.

శారీరక శ్రమతోనే ఆరోగ్యం

● హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టర్ తలాడ దీప్తి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హీల్ ప్రాజెక్టు ప్రతినిధి దీప్తి

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమతోనే మనిషి ఆరోగ్యంగా ఉండొచ్చని హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టరు తలాడ దీప్తి తెలిపారు. చెల్లూరులోని ఎంపీయూపీ స్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన జీవనశైలితో ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. తాజా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, ఆహారంగా తీసుకోవాలన్నారు. మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.రాము, ప్రాజెక్టు సీడీపీఓ ఎం.వంశీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు

సాలూరు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్ర జ్యోతి): సాలూరులో తొమ్మిది రోజులకు నిర్వహిస్తున్న సీతా రాములు వసంత నవరాత్రోత్సవాలు సోమవారం పట్టాభిషేక పూజలతో ముగి శాయి. వెలమపేట, పెదకోమటిపేట, డబ్బివీధి, వేంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో మహారాజ్య పట్టాభిషేక పూజలను నిర్వహించారు. డబ్బివీధిలో వేలాది మంది భక్తులకు నారాయణ సేవ చేపట్టారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు రాత్రి ఘనంగా తిరువీధి నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ కృష్ణసఖి బృందం మహిళలు కోలాటంతో చేసిన నృత్యార్చన ఆకట్టుకుంది.

కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వం

పాలకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేసే కార్యకర్తలకు అన్యాయం జరగనివ్వకుండా చూసుకుంటామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు అన్నారు. స్థానిక రమా సత్యనారాయణ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేసిన వారికి ఏఎంసీ వైస్ చైర్మన్ పదవి ఇవ్వడంపై అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ .. నామినేటెడ్ పదవులు నిజమైన క్యాడర్ దక్కేలా కృషి చేస్తామన్నారు. నాయకులు జాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

బెలగాం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానని ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక డీవీఎం పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి మూల్యాంకనం కేంద్రాన్ని ఎమ్మెల్సీ పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి డీఈవో రమా జ్యోతి, తవిటినాయుడు, కాగాన విజయ్, మరిచర్ల జగదీశ్వర్, గుల్ల శంకర్రావు ఉన్నారు.

● సీతానగరం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ రూల్స్ సాధించి పదోన్నతులు తీసుకువస్తానని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు తెలిపారు.జిల్లా కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ కేంద్రంలో గల ఉపాధ్యాయులను కలిసేందుకు వెళ్తున్న శ్రీనివాసులనాయుడు ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వి.తవిటినాయుడు, ప్రధాన కార్యదర్శి కె.విజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

డీఎం తీరు మార్చుకోవాలి

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గా కార్మికుల పట్ల అనుసరిస్తున్న తీరు మార్చుకోవాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.సీతాలక్ష్మి కోరారు. సోమవారం పార్వతీపురం డిపోగేటు వద్ద కార్మికులపై డీఎం తీరును నిరసిస్తూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్‌సభ్యుల మధ్య చిన్నతగాదాలు వస్తే పరిష్కరించాల్సిన డీఎం, మరో యూనియన్ సభ్యుడు వైపు పక్షపాత వైఖరి అవలంబించి ఎస్ డబ్ల్యూఎఫ్ సభ్యుడు తాతాబాబును సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్‌లు, బదిలీలు చేస్తుండడం బాధకరమని, తాతబాబును విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

జనావాసాల మధ్య చేపల విక్రయం తగదు

గజపతినగరం ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): స్థానిక బూర్లివీధికి ఆనుకుని ఉన్న కూరగాయల మార్కెట్ యార్డులో చేపల విక్రయాలు వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీకి చెందిన మహేశ్, సునీల్‌కుమార్, కుమారితో పాటు పలువురు సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఐదో వార్డుకు సంబంధించి జనావాసాల మధ్య చేపల విక్రయాలు నిలిపివేయించాలన్నారు. గతంలోనూ ఫిర్యాదు చేశామని ఇప్పటికైనా పంచాయతీ పాలకులు స్పందించాలరి వారు కోరారు.

గజపతినగరంలో శ్రీరామపట్టాభిషేకం

గజపతినగరం ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి):స్థానిక సీతారామ గ్రూపు దేవాలయంలో సోమవారం ఘనంగా సీతారాములకు పట్టాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు సుధాకర్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన న్యాయవాది రమేశ్‌రాజు దంపతుల పర్యవేక్షణలో పట్టాభిషేకం జరిగింది. కార్యక్రమానికి పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాత్రి విధులు రద్దు చేయండి

చీపురుపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని వీఆర్‌ఏలు తహసీల్దారు రాజారావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారుకు తమ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘ నాయకులు మాట్లాడుతూ కనీసం రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, డీఏను జీతంతో కలిపి ఇవ్వాలని, రాత్రి విధులను రద్దు చేయాలని వారు కోరారు. అర్హులైన వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించాలన్నారు. తహసీల్దారును కలిసిన వారిలో దండి సూర్యనారాయణ, ఎస్.అనురాధ, బి.మహలక్ష్మి, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.